క్లుప్తంగా

నేడు ఉచిత గుండె పరీక్షలు


డాక్టర్ చందూలాల్

షాద్‌నగర్‌రూరల్: జనని చిన్న పిల్లల ఆస్పత్రిలో శుక్రవారం నిర్వహించనున్న ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ చందూలాల్ రాథోడ్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. వయస్సుతో నిమిత్తం లేకుండా గుండె సంబంధిత వ్యాధుల బారిన పడుతున్నారని చెప్పారు. అవగాహన కొరవడి అకాల మరణం చెందుతున్నారన్నారు. శారీరక శ్రమ లేకపోవడం, ఆహారపు అలవాట్లలో మార్పులు, నూనె పదార్థాలు, ధూమపానం ఎక్కువగా తీసుకోవడంతో గుండెకు సంబంధించిన వ్యాధులు వచ్చేఅవకాశాలు ఉంటాయని వివరించారు. ప్రపంచ హృదయ దినోత్సవం సందర్భంగా హృదయ శ్రేయస్సును కోరి గుండె సంబంధిత ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. 25 సంవత్సరాలు పై బడిన వారందరికి ఉచితంగా 2డీ–ఈకో, కార్డియో గ్రాం, ఈసీజీ, షుగర్, గుండె పరీక్ష నిర్వహించి మందులను పంపిణీ చేస్తామన్నారు.

జనాభా దామాషా ప్రకారమే..

- మహిళా బిల్లు అమలు చేయాలి
- ధర్మ సమాజ్ పార్టీ ప్రచార కమిటీ సభ్యుడు భిక్షపతి


కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న డీఎస్పీ నాయకులు

కొందుర్గు: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహిళా బిల్లును జనాభా దామాషా ప్రకారం అమలుచేయాలని ధర్మ సమాజ్ పార్టీ రాష్ట్ర ప్రచార కమిటీ సభ్యుడు భిక్షపతి డిమాండ్ చేశారు. ఈ మేరకు చౌదరిగూడలో పార్టీ ఆధ్వర్యంలో గురువారం కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 33 శాతం మహిళా రిజర్వేషన్‌లో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు మహిళలకు జనాభా ప్రకారం రిజర్వేషన్ ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో గిరి, శ్రీను, నర్సింలు, సిద్ధు, రామస్వామి, శ్రీకాంత్, కుమార్, రవీందర్, యాదయ్య, నరేందర్, శివ, గోపాల్ పాల్గొన్నారు.

తలసేమియాను తరిమికొడదాం

డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ జయలక్ష్మి


సమావేశంలో మాట్లాడుతున్న జయలక్ష్మి

షాద్‌నగర్‌రూరల్: ప్రతిఒక్కరూ పౌష్టికాహారం తీసుకుంటే తలసేమియా వ్యాధిని తరిమికొట్టవచ్చని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ జయలక్ష్మి అన్నారు. ఆయుష్మాన్‌భవ కార్యక్రమంలో భాగంగా గురువారం ఫరూఖ్‌నగర్ మండలం దూసకల్ గ్రామంలోని హెల్త్ వెల్‌నెస్ సెంటర్‌ను డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సందర్శించారు. ఈ సందర్భంగా తలసేమియా వ్యాధిపై అవగాహన కల్పించారు. డాక్టర్ జయలక్ష్మి మాట్లాడుతూ.... మానవుని శరీరంలో హిమోగ్లోబిన్ శాతం తక్కువగా ఉండటంతో ఎర్రరక్త కణాలు తగ్గిపోయి తలసేమియా వ్యాధి సోకుతుందని అన్నారు. తలసేమియా వ్యాధి బారిన పడకుండా ఉండాలంటే ఆకు కూరలు, పండ్లు, పాలు, గుడ్లువంటి పోషక విలువలు కలిగిన పౌష్టికాహారాన్ని ఎక్కువగా తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ వైద్యాధికారులు శ్వేత, సుదీప్తి, హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసులు, హెల్త్ సూపర్‌వైజర్ పుష్ప, ఏఎన్‌ఎంలు గౌసియా, సంతోష తదితరులు పాల్గొన్నారు.

30న జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలు

కడ్తాల్: మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో ఈ నెల 30న, 67వ స్కూల్‌గేమ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో, జిల్లాస్థాయి వాలీబాల్ క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు, జోనల్ క్రీడల కార్యదర్శి భీముడు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉ. 9 గంటల 30 నిమిషాలకు వాలీబాల్ క్రీడాపోటీలు ప్రారంభమవుతాయని, పోటీలకు ఎంపికైన క్రీడాకారులు, సకాలంలో పోటీలకు హాజరుకాగలరని కోరారు. క్రీడల ప్రారంభోత్సవానికి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ , అధికారులు హాజరవుతారని తెలిపారు.

కాంగ్రెస్ ఏబ్లాక్ అధ్యక్షుడిగా పాండురంగారెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: ఇబ్రహీంపట్నం నియోజకవర్గం కాంగ్రెస్‌పార్టీ ఏ బ్లాక్ అధ్యక్షుడిగా ఏదుళ్ల పాండురంగారెడ్డిని నియమించారు. ఈ మేరకు పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా పాండురంగారెడ్డి మాట్లాడుతూ.. 25 ఏళ్లుగా పార్టీ అభివృద్ధికి పని చేశానని తెలిపారు. నాపై నమ్మకంతో పదవీ బాధ్యతలు అప్పగించిన పార్టీ పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు.

జైజై గణేశా.. బైబై గణేశా

వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా గురువారం నిర్వహించిన గణపతి నిమజ్జనం ఉత్సాహంగా సాగింది. జైజై గణేశా.. బైబై గణేశా అంటూ భక్తులు గౌరీ తనయుడిని గంగమ్మ ఒడికి చేర్చారు. బ్యాండ్ మేళాలు, తీన్మార్ స్టెప్పులతో పల్లె, పట్నం చిందేసింది.

- ఉత్సాహంగా సాగిన గణపతి శోభాయాత్ర
- యువత తీన్మార్ స్టెప్పులు
- వేలంలో లక్షలు పలికిన లడ్డూలు
- గంగమ్మ ఒడికి చేరిన గౌరీ తనయుడు


చేవెళ్ల: గణనాథుడి శోభాయాత్ర

చేవెళ్ల: మండల పరిధిలోని ప్రతిష్ఠించిన గణనాథులను గురువారం శోభాయాత్రగా నిమజ్జనానికి తరలించారు. ఈ సంరదర్భంగా నిర్వహించిన లడ్డూ వేలంలో లక్షలు వెచ్చించి కైవసం చేసుకునేందుకు పోటీ పడ్డారు. మండల పరిధిలోని గుండాల గ్రామంలో వినాయకుడి లడ్డూ ప్రసాదాన్ని కేశపల్లి విష్ణువర్ధన్‌రెడ్డి రూ.6లక్షలకు దక్కించుకున్నారు. పట్టణంలోని జర్నలిస్టు కాలనీలోని పురుషోత్తంరెడ్డి, ప్రశాంత్ రూ.4.12లక్షలకు సొంతం చేసుకున్నారు. అల్లవాడ హనుమాన్ ఆలయం వద్ద ప్రతిష్ఠించిన గణపతి లడ్డూను అంబేడ్కర్ యూత్ అసోసియేషన్ సభ్యులు రూ.3.10లక్షలకు కైవసం చేసుకున్నారు. మల్లారెడ్డిగూడలో ఎం.శ్రీనివాస్‌రెడ్డి రూ.1.61లక్షలకు, భుజంగరెడ్డి రూ.1.51లక్షలకు, ఇక్కారెడ్డిగూడలో జి.ప్రభాకర్‌రెడ్డి రూ.1.51లక్షలకు వేలంలో దక్కించుకన్నారు.

ఒకే రోజు 350 విగ్రహాలు

మొయినాబాద్‌రూరల్: ప్రతీ సంవత్సరం ఎన్కేపల్లిలో నెలకొల్పిన గణనాథులను ఒకే రోజు నిమజ్జనం చేయడం ఆనవాయితీగా వస్తోంది. దీంతో గురువారం గ్రామమంతా గణేశుడి నినాదాలతో హోరెత్తింది. ఒకే రోజు 350 విగ్రహాల శోభాయాత్రను చూసేందుకు రెండు కన్నులు చాల లేదు. ఈ ఊరేగింపునకు కాంగ్రెస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అమర్‌నాథ్‌రెడ్డి పాల్గొని నృత్యాలు చేస్తూ భక్తుల్లో జోష్ నింపారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల ప్రజలతో పాటు ప్రజాప్రతినిధులు నాయకులు పాల్గొన్నారు.

ఉప్పొంగిన భక్తిభావం

షాద్‌నగర్ రూరల్: ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని మధురాపూర్ గ్రామంలో రెడ్డి సేవా సమితి ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన గణపతి లడ్డూ రికార్డు ధర పలికింది. గురువారం ఉత్సవ కమిటీ సభ్యులు లడ్డూ వేలం నిర్వహించారు. ఈ వేలంలో రూ.11.51లక్షలకు గ్రామానికి చెందిన శేరి పర్వత్‌రెడ్డి కైవసం చేసుకున్నారు.

మతసామరస్యం చాటుకున్న ముస్లింలు

మున్సిపల్ పరిధిలోని చటాన్‌పల్లిలో నిర్వహించిన లడ్డూ వేలంలో ముస్లింలు పాల్గొన్నారు. చటాన్‌పల్లికి చెందిన నాయకుడు యాకుబ్‌పాష రూ.1.71లక్షలకు లడ్డూను కైవసం చేసుకున్నారు. గణేశ్ నగర్‌కాలనీలో రూ.1.13లక్షలకు కాలనీకి చెందిన వెంకటేశ్ మేస్త్రీ దక్కించుకున్నాడు.


మొయినాబాద్ రూరల్: ఎన్కేపల్లిలో శోభాయాత్రలో అమర్‌నాథ్‌రెడ్డి


చేవెళ్ల: గుండాలలో రూ.6లక్షలకు దక్కించుకున్న విష్ణువర్ధన్‌రెడ్డి


చేవెళ్ల: రూ.4.12లక్షలకు కైవసం చేసుకున్న పురుషోత్తం రెడ్డి, ప్రశాంత్


షాద్‌నగర్ రూరల్: చటాన్‌పల్లిలో రూ.1.13లక్షలకు వెంకటేశ్ మేస్త్రీ


చేవెళ్ల: అల్లవాడలో రూ.3.10లక్షలకు దక్కించుకున్న అంబేద్కర్ యూత్ సభ్యులు

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

ఎమ్మెల్యే అంజయ్యయాదవ్


చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే అంజయ్యయాదవ్

షాద్‌నగర్‌రూరల్: సీఎంఆర్ఎఫ్ పేదలకు వరమని ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ అన్నారు. గురువారం ఆయన ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బాధితులకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ అన్ని వర్గాల అభివృద్ధికి కృషి చేస్తున్నారని అన్నారు. ఆపదలో ఉన్న పేదలను ఆదుకునేందుకే అర్హులందరికీ సీఎంఆర్ఎఫ్ నుంచి నిధులు అందజేస్తున్నారని చెప్పారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు సీఎం కేసీఆర్‌కు, ఎమ్మెల్యే అంజయ్యయాదవ్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కొందూటి నరేందర్, వైస్ చైర్మన్ ఎంఎస్.నటరాజ్, కౌన్సిలర్లు ఈగ వెంకట్‌రాంరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, జీటీ శ్రీనివాస్, నాయకులు అగ్గనూరి విశ్వం, నారాయణరెడ్డి, మహ్మద్ ఎజాజ్ తదితరులు పాల్గొన్నారు.

'ఆరు' పథకాలతో అధికారం గ్యారంటీ


కాంగ్రెస్ పథకాలను ప్రచారం చేస్తున్న వీర్లపల్లి శంకర్ తదితరులు

- హామీలను విస్మరించిన ప్రభుత్వాలు ఇంటికే
- పీసీసీ ప్రధాన కార్యదర్శి వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్: కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీ పథకాలతో అధికారం సాధిస్తామని పీసీసీ ప్రధానకార్యదర్శి వీర్లపల్లి శంకర్ అన్నారు. గురువారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని మొగిలిగిద్ద గ్రామంలో కాంగ్రెస్ గ్యారంటీ పథకాలను ఇంటింటికీ ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ.. ప్రత్యేక తెలంగాణ ఆకాంక్ష కాంగ్రెస్‌తోనే సాధ్యమైందన్నారు. రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకు సమన్యాయం చేయడమే పార్టీ ధ్యేయమన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాలకు ప్రజలు పూర్తి మద్దతు తెలుపుతున్నారని అన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ఆరు గ్యారంటీ పథకాలను అమలు చేసేందుకు కాంగ్రెస్ పార్టీ చర్యలు తీసుకుంటుందన్నారు. బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చి తొమ్మిదేళ్లు గడుస్తున్నా పేదలకు డబుల్ బెడ్ రూం ఇళ్లు పంపిణీ చేయలేదని ఆరోపించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఇంటికి పంపిస్తామని అన్నారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్‌కు పూర్వ వైభవాన్ని తీసుకువచ్చేందుకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమాలకు భయపడే అరెస్టులు

సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి దేవేందర్


షాబాద్: పోలీసుల అదుపులో దేవేందర్, అంగన్‌వాడీ టీచర్లు, ఆశ కార్యకర్తలు

షాబాద్: ప్రభుత్వం ఉద్యమాలకు భయపడి అక్రమ అరెస్టులకు తెరలేపిందని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం మండల పరిధిలోని సీతారాంపూర్ గ్రామంలో మంత్రి కేటీఆర్ పర్యటన నేపథ్యంలో బీఆర్ఎస్ ప్రభుత్వం సీఐటీయూ, అంగన్‌వాడీ టీచర్లు, ఆశ కార్యకర్తలను అరెస్టు చేశారు. ఈ సందర్భంగా దేవేందర్ మాట్లాడుతూ.. అక్రమ అరెస్టులను ఖండిస్తున్నామన్నారు. పోలీసులు అదుపులోకి తీసుకున్నవారికలో తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు ఉమా, స్వప్న, ప్రమీణ, తెలంగాణ సీఐటీయూ చేవెళ్ల మండల అధ్యక్ష, కార్యదర్శులు అన్నపూర్ణ, నిర్మల తదితరులున్నారు.

ముందస్తు అరెస్టులు సరికాదు

కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చంద్రశేఖర్



షాబాద్ పీఎస్‌లో కాంగ్రెస్ నాయకులు

షాబాద్: మంత్రి కేటీఆర్ పర్యటన సందర్భంగా పోలీసులు కాంగ్రెస్ నాయకులను ముందస్తు అరెస్టులు చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కావలి చంద్రశేఖర్ మాట్లాడుతూ.. అక్రమంగా అరెస్టులు చేయడం సరికాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సీతారాంపూర్, చందనవెళ్లి వెల్‌స్పన్ కంపెనీలో పరిశ్రమ శంకుస్థానకు విచ్చేస్తున్న మంత్రి కేటీఆర్ వస్తున్నందున తమను అరెస్టు ఎందుకు చేస్తున్నారని మండి పడ్డారు. సీతారాంపూర్, చందనవెళ్లి, హైతాబాద్, మాచన్‌పల్లి రెవెన్యూ పరిధిలో ప్రభుత్వం భూసేకరణ చేపట్టిందన్నారు. ఇందుకు సంబంధించి చాలామంది రైతులకు నష్టపరిహారం అందలేదన్నారు. అదే విషయం కేటీఆర్‌ను కలిసి వినతిపత్రం ఇవ్వాలనుకుంటే నాయకులను ముందుగానే అరెస్టు చేయడం అప్రజాస్వామికమన్నారు. భూ నిర్వాసితులకు న్యాయం జరిగే వరకు అఖిలపక్షం అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు కుమ్మరి చెన్నయ్య, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, జంగయ్య, ఖుద్దూస్, మల్లేశ్, గౌరీశ్వర్ తదితరులున్నారు.

విప్లవ చైతన్యానికి నాంది.. భగత్ సింగ్


షాద్‌నగర్: భగత్‌సింగ్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న యూత్ సభ్యులు


షాద్‌నగర్ రూరల్: భగత్‌సింగ్ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

కాంగ్రెస్ ఫిషర్‌మెన్ కమిటీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నర్సింహ

షాద్‌నగర్: ప్రతీ ఒక్కరు భగత్‌సింగ్ అడుగుజాడల్లో నడుచుకోవాలని కాంగ్రెస్ ఫిషర్‌మెన్ కమిటీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బుడ్డ నర్సింహ అన్నారు. గురువారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని ఎలికట్ట గ్రామంలో భగత్‌సింగ్ యూత్ ఆధ్వర్యంలో భగత్ సింగ్ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళి అర్పించారు. అనంతరం నర్సింహ మాట్లాడుతూ.. భగత్‌సింగ్ విప్లవ చైతన్యానికి మారుపేరుగా నిలిచారన్నారు. ఆయన చూపిన శౌర్యం, త్యాగం, దేశం పట్ల ఆయనకున్న ప్రేమ ఎప్పటికీ మరిచిపోలేనివన్నారు. ఈ కార్యక్రమంలో మాధవ్, కృష్ణయ్య, ఎండి.యూసుఫ్, శ్రీను, సురేశ్, కిట్టుయాదవ్, రాజేశ్, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

భగత్‌సింగ్ ఆశయ సాధనకు కృషి

షాద్‌నగర్‌రూరల్: ప్రతీ ఒక్కరు భగత్‌సింగ్ ఆశయ సాధనకు కృషి చేయాలని భారత విద్యార్థి ఫెడరేషన్(ఎస్ఎఫ్ఐ) డివిజన్ అధ్యక్షుడు శ్రీకాంత్ అన్నారు. గురువారం భగత్‌సింగ్ జయంతి సందర్భంగా ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పట్టణంలో ఆయన విగ్రహానికి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ డివిజన్ అధ్యక్షుడు శ్రీకాంత్ మాట్లాడుతూ... దేశంకోసం ప్రాణాలను త్యాగం చేసిన మహనీయులు సాహిద్ భగత్‌సింగ్ అన్నారు. యువతకు ఆయన జీవితం స్ఫూర్తిదాయకమన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు శివ, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

సబ్బండ వర్గాల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

బండ్లగూడ: రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలకు అండగా ఉంటూ వారి అభ్యున్నతికి పాటుపడుతోందని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ అన్నారు. బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కురుమ సంఘం ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర కురుమ సంఘం అధ్యక్షుడు ఎగ్గె మల్లేశం అధ్యక్షతన ఎమ్మెల్యేను కలిసి సంఘం నూతన భవనం నిర్మించాలని ఎమ్మెల్యేకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ మాట్లాడుతూ... కురుమ సంఘం భవనం నిర్మాణంతోపాటు స్థల విషయమై ప్రభుత్వం సానుకూలంగా ఉందన్నారు. త్వరలో భూమి పూజ నిర్వహించి పనులను ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కురుమ సంఘం అధ్యక్షుడు తాండ్ర రమేష్‌కుమార్ కురుమ, ఉపాధ్యక్షులు ఎర్ర విజయ్‌కుమార్, మల్లేష్ కురుమ, పి.రమేష్ కురుమ, ప్రధాన కార్యదర్శి కె.లక్ష్మణ్ కుర సంయుక్త కార్యదర్శి కె.సత్యనారాయణ కురుమ, ఆర్గనైజర్ సెక్రటరీ సత్యనారాయణకురుమ, కోశాధికారి ఎస్.విఠలయ్యకురుమ, కార్యదర్శులు సురేందర్ కురుమ, బాబురావు, అల్లి శ్రీశైలం, బాలరాజు, శ్రీశైలం, కృష్ణయ్యకురుమ, సలహాదారులు మాణిక్యం, కార్యవర్గ సభ్యులు జగదీష్, వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

'ఆశ'ల డిమాండ్లను నెరవేర్చండి

ఏఐటీయూసీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రామస్వామి


చేవెళ్ల: ఆశవర్కర్ల సమ్మెకు సంఘీభావం తెలుపుతున్న ఏఐటీయూసీ నాయకులు

చేవెళ్ల: తమ సమస్యల పరిష్కారానికి ఆశ కార్యకర్తలు చేపట్టిన సమ్మె గురువారంతో నాలుగు రోజులకు చేరింది. సమ్మెకు మద్దతుగా ఏఐటీయూసీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కె.రామస్వామి మాట్లాడుతూ.. ఆశవర్కర్ల సేవలను ప్రభుత్వం గుర్తించకపోవటం సరికాదన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి వారి న్యాయమైన డిమాండ్ల నెరవేర్చేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు మక్బుల్, అంజయ్య, మల్లేశ్, శౌరీలు, మంజుల, యాదగిరి, ఆనందం, స్వరూప, అనసూయ, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

అధికారంలోకి రాగానే పరిష్కారం

కేశంపేట: మండల కేంద్రంలో సమ్మె చేస్తున్న ఆశ కార్యకర్తలు, మధ్యాహ్న భోజన కార్మికుల సమ్మెకు బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అశోక్‌గౌడ్, మండల అధ్యక్షుడు నర్సింహయాదవ్ గురువారం సంఘీభావం తెలిపారు. వారు మాట్లాడుతూ... బీజేపీ అధికారంలోకి వచ్చిన వెంటనే సమస్యలు పరిష్కరిస్తామన్నారు. శ్రీను, నరేందర్‌రెడ్డి, శ్రీనివాస్, హరికృష్ణ, నరేందర్‌రెడ్డి, మహేశ్ తదితరులున్నారు.

రూ.18వేల వేతనం ఇవ్వాలి

కొందుర్గు: మండల కేంద్రంలో ఆశ కార్యకర్తల సమ్మె కొనసాగుతోంది. గురువారం వారు మాట్లాడుతూ ప్రభుత్వం తమకు కనీస వేతనం రూ.18వేల వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ మండల కార్యదర్శి రాయికంటి గోపాల్ ఆశ కార్యకర్తల సమ్మెకు మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆశ కార్యకర్తలు అంజలి, పావని, యాదమ్మ, సుందరమ్మ, సువర్ణ, రమాదేవి పాల్గొన్నారు.


కొందుర్గు: సమ్మెలో పాల్గొన్న ఆశ కార్యకర్తలు

పాలమూరు సభతోనే ఎన్నికల శంఖారావం



షాద్‌నగర్: మాట్లాడుతున్న మిథున్‌రెడ్డి


కొందుర్గు: మాట్లాడుతున్న బాబయ్య


నందిగామ: కొత్తూరులో మాట్లాడుతున్న భూపాలచారి

బీజేపీ నాయకుడు మిథున్‌రెడ్డి

షాద్‌నగర్: ప్రధాని మోదీ పాలమూరు పర్యటనలో భాగంగా నిర్వహించనున్న సభ నుంచి ఎన్నికల శంఖారావాన్ని పూరించబోతున్నారని బీజేపీ నాయకుడు మిథున్‌రెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మిథున్‌రెడ్డి మాట్లాడారు. పాలమూరులో ఏర్పాటుచేసే సభ 2023 ఎన్నికల శంఖారావం సభ అన్నారు. పాలమూరు బహిరంగ సభను విజయవంతం చేసేందుకు పార్టీ నాయకులు ఎంతో కృషి చేస్తున్నారని అన్నారు. సభకు కనీసం లక్షన్నర మందిని తరలించేందుకు జనసమీకరణ చేయనున్నట్లు తెలిపారు. మున్సిపాలిటీ నుంచి 15వేల మందిని తరలించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోడీ సభతో సీఎం కేసీఆర్‌కు పతనం ప్రారంభమవుతుందని అన్నారు. రాష్ట్రంలో బీజేపీ ఒక్క అవకాశం ఇవ్వాలని, డబుల్ ఇంజిన్ సర్కారుతో అభివృద్ధి, సంక్షేమ ఫలాలు ప్రజలకు దక్కుతాయని అన్నారు. ఈ సమావేశంలో బీజేపీ నాయకులు రుషికేశ్, మల్లెలం మురళి, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రధాని సభను విజయవంతం చేయండి

కొందుర్గు: పాలమూరు ప్రజా గర్జన పేరున మహబూబ్‌నగర్‌లో అక్టోబర్ 1న నిర్వహించే సభను విజయవంతం చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందె బాబయ్య పిలుపునిచ్చారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. కేంద్రం ఇచ్చిన నిధులతో రాష్ట్ర ప్రభుత్వం పనులు చేపడుతూ కేంద్ర ప్రభుత్వం నిధులివ్వడం లేదని బీఆర్ఎస్ నాయకులు చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. చౌదరిగూడ మండల కేంద్రంలో బీజేపీ నేత శ్రీవర్ధన్ రెడ్డి సమావేశం ఏర్పాటుచేసి మాట్లాడారు. ఈ సమావేశంలో నాయకులు పటేల్ ప్రభులింగం, బోయ శంకర్, అంజయ్య, నరేష్, యాదయ్య, శ్రీనివాసు, కిరణ్‌కుమార్, శేఖర్, వీరయ్య, శ్రీనివాసు, వినోద్, శ్రీకాంత్, హరీష్, శివ, శంకర్, వంశీ పాల్గొన్నారు.

నందిగామ/కేశంపేట: మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో అక్టోబర్ 1న బీజేపీ తలపెట్టిన పాలమూరు ప్రజాగర్జన బహిరంగసభకు ప్రతీ బూత్ నుంచి కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలిరావలాని పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి దేపల్లి అశోక్‌గౌడ్ పిలుపునిచ్చారు. బుధవారం పార్టీ చేగూరు మండల అధ్యక్షుడు సుధాకరప్ప ఆధ్యక్షతన గురువారం సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అశోక్‌గౌడ్ మాట్లాడుతూ.. ప్రధాని మోదీ విచ్చేయనున్న ఈ సభను విజయవంతం చేసేందుకు పార్టీ శ్రేణులంతా సమన్వయం చేసుకుని విజయవంతం చేయలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సత్యం, రాజు, విశ్వనాథం, సత్తయ్య, లక్ష్మయ్య, బండి శ్రీను, శ్రీశైలం, ఈశ్వరయ్య, జంగయ్య,ప్రభాకర్, ప్రశాంత్, ప్రవీన్, అమృత పాల్గొన్నారు.

కొత్తూరులో

మండల కేంద్రమైన కొత్తూరులో బీజేపీ మండల పార్టీ అధ్యక్షుడు మల్‌రెడ్డి మహేందర్ రెడ్డి అధ్యక్షతన కార్యకర్తల సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ఈసమావేశంలో పాల్గొన్న పార్టీ సీనియర్ నాయకుడు కమ్మరి భూపాల చారి మాట్లాడుతూ.. మోదీ సభను విజయవంతం చేయుటకు ప్రతి ఒక్క కార్యకర్త కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు మాణిక్యం, వెంకటేశ్, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.